
# తృప్తి

సదానంద్ శారద



భూమి 'ఎడారి' కాకుండా చేసేదేది? అనే వ్యాసం చదువుతున్నాను.

భూమి అడుగునుంచి పచ్చికను బయటికిలాగే శక్తి ఏది? అని ప్రశ్నిస్తో.... రచయిత ఆ వ్యాసం ప్రారంభించాడు.

"ఏడ్వకు నాన్నా.... అంగో దాబా ఎక్కుదామా?"

తలెత్తి చూశాను.

ఎదుటి పాకలో అద్దెకుంటున్నవాళ్ళ అమ్మాయి గౌరి. ఆ అమ్మాయికి తల్లి లేదు. తండ్రి మరోపెళ్ళి చేసుకున్నాడు. ఆమెకో కొడుకు. ఆ అబ్బాయిని భుజం మీద వేసుకొని ఊరోక్కబెడుతున్నది గౌరి. చాలాసేపట్నించి ఏడుస్తున్నట్టున్నాడు.

"మీ పిన్ని లేదా?" అని అడిగాను.

"లేదు అంకుల్...."

పొద్దున వాళ్ళ పిన్ని పక్కింటా వవిడను_"ఒక రూపాయి ఉంటే ఇవ్వు వదినా" అని అడగడం గుర్తుకొచ్చింది. ఆమె లేవన్నట్లుంది. మరో వాటాలో అడిగిచూసింది. చివరికి ఎలాగో సంపాదించి మార్నింగ్‌షోకు వెళ్ళినట్టుంది.

ఆ అబ్బాయి చేతిలో చిన్న బిస్కట్ ముక్క ఉంది_

"ఏడ్వకు నాన్నా.... బిక్కి తిను_" అని తమ్ముణ్ణి బుజ్జగిస్తూ డాబామెట్లెక్కుతున్నది గౌరి.

గౌరికి తొమ్మిదేండ్లుంటాయి కాబోలు.

పినతల్లి నోరు ముద్దుగా 'కర్రెదానా' అని పిలవడంకోసం ఆ అమ్మాయికి నలుపురంగు నిచ్చిపోయింది తల్లి. దానికి తోడు దిగేసిన మొలల్లా మొహంమీద అక్కడక్కడ స్ఫోటకం మచ్చలు.

పేరుపెట్టి పిలవడమేకాదు ఆ అమ్మాయిని చూడాలన్నా పినతల్లికి అసహ్యం.

ఆ అసహ్యన్నంతా 'కర్రెదానా' అనే పదంలో ఇమిడ్చి తీస్తూంటుంది.

ఆ విధంగా గౌరికి తల్లిపెట్టిన పేరు కాక పినతల్లి పెట్టినపేరే ఖాయమయింది.

పొట్టి లంగా, చిరుగుల జాకెట్ ఆ అమ్మాయి గుర్తులు పినతల్లి తిట్లు, దెబ్బలు ఆ అమ్మాయి నేస్తాలు.

మెట్లెక్కి మేము అద్దెకున్న డాబా మీదికి తమ్ముణ్ణి తీసుకపోయింది గౌరి.

అక్కణ్నుంచి చూస్తే నిత్యం డ్రైనేజీ నీళ్లతో స్నానంచేసే రోడ్డు కనిపిస్తుంది_ ఆ రోడ్డుకవతల రిటైర్డ్ స్టేషన్‌మాస్టర్ రంగస్వామి 'చౌకధరల బొగ్గుల కొట్టు' ఉంది. ఆ బోర్డును రిటైరయేముందు రైల్వే ఆర్టిస్టుతో స్పెషల్‌గా రాయించుకున్నాడట రంగస్వామి.

రంగస్వామి 'కొట్టు'కు ప్రక్కన శౌరయ్య అన్నివిధములైన వస్తువులు లభించు చిల్లరకొట్టు.... దానిముందు వెలగని ట్యూబ్‌లైటును మోస్తూ మునిసిపాలిటీ 'గొడ్రాలు స్తంభం'.... ఇంకా ముందుకు చూస్తే పెంటకుప్ప.. ప్రభుత్వ కల్లుదుకాణం, ప్రభుత్వ సారాదుకాణం, ప్రైవేట్ టైలర్‌షాపు కనిపిస్తాయి.

దానివెనక ఒక ప్రైవేట్ కార్ఖానాలో పనిచేస్తూ ప్రభుత్వ కల్లు దు కా ణం, ప్రభుత్వ సారాదుకాణంలో ఖర్చుచేస్తుంటాడు గౌరితండ్రి.

తిన్న బిస్కట్ముక్క అరిగిపోయి, చూస్తున్న మురికిరోడ్డు, మున్సిపాలిటీ పెంటకుప్ప ప్రభుత్వ కల్లుదుకాణం, ప్రభుత్వ సారాదుకాణం, ప్రైవేట్ టైలర్ షాపు పాతబడి గౌరితమ్ముడు మళ్లీ రాగం అందుకున్నాడు_

డాబా దిగి ఇంట్లోకి తీసుకపోయి నీళ్ళు తాగించినట్టుంది గౌరి.

ఆ అబ్బాయి ఏడ్పుమానలేదు.

భుజంమీద వేసుకొని అటూ ఇటూ తిప్పింది. వచ్చీ రా ని జోలపాటలు పాడింది.

తనను నిద్రబుచ్చాలనే ప్రయత్నం జరుగుతున్నట్టు తెలుసుకున్నాడేమో మరింత బిగ్గరగా ఏడ్వసాగాడు.

ప్రక్క వాటాలు కసురుకున్నాయి.

"ఆ పిలగానికి ఇంతేమన్న తినిపించ రాదు పిల్లా...." అంది సుబ్బమ్మ. వాళ్ళాయనకు రెవిన్యూడిపార్ట్ మెంట్ లో ఉద్యోగం.

"అంగో రవి.... అంకుల్ బొమ్మల పుస్తకం ఇస్తాడు చూద్దామా...." అంటూ మా గదిముందుకు తీసుకొచ్చింది.

ఆ అబ్బాయికి నిక్కరుంటె షర్ట్ ఉండదు. షర్ట్ ఉంటె నిక్కరుండదు. ఒక్కోసారి ఆ రెండూ ఉండవు. ప్రస్తుతం బొత్తాములు లేని షర్ట్ ఉంది. ముక్కునిండా చీమిడి ఉంది. లంగాతో తమ్ముడి ముక్కు తుడిచి, వేళ్ళతో చింపిరి తల దువ్వి...."ఊరో్కో నాన్నా...." అంటూ భుజానికి హత్తుకుంది.

"లోపలికి రా గౌరీ...." అని పిలిచాను.

వచ్చి చాపమీదకూర్చుంది. తమ్ముణ్ని ఒళ్ళో కూర్చోబెట్టుకుంది. అక్క మెడ చుట్టూ చేతులువేసి ఏడ్వసాగాడు.

"ఆకలవుతుందేమో గౌరి" అన్నాను.

అవునన్నట్లు తలూపింది.

"అన్నం తినిపించరాదూ...."

ఆ అమ్మాయి మాట్లాడలేదు.

తమ్ముణ్ని భుజంమీద వేసుకొని జోకొట్టసాగింది.

మౌనమే గౌరి సమాధానం.

లేచి పళ్ళెంలో అన్నం, కూర వేసి ఇచ్చాను. చేయి కడుక్కొనివచ్చి తినిపించింది. బాగా ఆకలితో ఉన్నాడేమో ఆత్రంగా తిన్నాడు.

"ఇంకొంచెం వేయనా గౌరి...."

"వద్దు అంకుల్, చాలు...." అంది తమ్ముడి మూతికడిగి తుడుస్తూ....

"నువ్వు తినవూ ?"

"ఊహుఁ.... నాకొద్దు."

"తినమ్మా...."

"వొద్దు అంకుల్ - నాకు ఆకలవుతూ లేదు" అంటూ లేచి పళ్ళెం, గ్లాసు కడిగి పెట్టింది.

తమ్ముడికి బొమ్మల పుస్తకాలు చూపిస్తూ కూర్చుంది - ఆ అబ్బాయి బొమ్మలు చూస్తూ అలాగే నిద్ర పోయాడు.

ఇంట్లోకి తీసుకపోయి పడుకో బెట్టిందో లేదో.... మార్నింగ్ షో వదిలినట్టున్నారు, వాళ్ళ పిన్ని వచ్చింది.

వస్తూనే బాత్ రూంకు వెళ్ళి - నీళ్ళు లేవేమో....

"ఫోరి నీకేం చెప్పిన్నే. బావిల నీళ్ళు చేదుకచ్చి పోయమన్ననా ?...." అంటూ గయ్యిన లేచింది.

బొక్కెన అందుకొని గబగబా వెళ్ళ పోయింది గౌరి. ఈ మధ్య పంపునీళ్లు సరిగా రావడంలేదు -

వెళ్తున్న ఆ అమ్మాయి రెక్క

పుచ్చుకొని– "అప్పట్నించి ఏం చేసినవే" అంటూ బూతులు తిట్టసాగింది.

"మీ అయ్య బాగా మేపుతాంటె నీకు పొగరెక్కిందే....నా దగ్గర గీ నఖ్రాలు సాగయి బొమ్మా.... ఏకీలుకాకీలు ఇరిసి పొయ్యిల పెట్ట ఏమనుకుంటు నవో...."

రాక్షసులు వెనక ఉండేవారు అంటారు కాని.... అబ్బే ఇప్పుడూ ఉన్నారు!

"నీకు నేనేం చెప్పిపోయిన్నే ముండా వచ్చేటాలకు నీళ్ల చేది పొయ్యమని చెప్పిన్నా లేదా....చెప్పిన్నాలేదే?" అంది మీదిమీదికి పోతూ–

బెదిరిపోయింది గౌరి.

"బాగా బలిసి, ఆటలకు మరిగి చెప్పిన పని చెయ్యవా?" అంటూ ఈడ్చి కొట్టింది చెంపమీద.

పంజా ఆహారాన్ని పట్టినట్లు ఆమె మెడనుపట్టి....

అటు చూడలేకపోయాను.

కళ్లు మూసుకొని....భారంగా ఛృకు టిని నొక్కుకున్నాను.అలోచిస్తూ అలాగే కూర్చుండిపోయాను–

తమ్ముణ్ని భుజంమీద వేసుకొని.... అప్పటిదాకా అటూఇటూ తిప్పిన గౌరి.... ఆ అమ్మాయి దీనవదనం...జాలిచూపులు నా కళ్ళలో మెదిలాయి.

ఏడ్చే తమ్ముణ్ని మోసిన ఆ భుజాలు చావుదెబ్బలు తిన్నాయి–

సాయంకాలం–

"అంకుల్...." అన్న పిలుపు విని కళ్లుతెరిచి చూశాను– గడపలో గౌరి నిల్చొని ఉంది.

"ఆఫీస్ టైమయింది కదా అంకుల్...."

టైం చూశాను. నాలుగయింది. నేను పనిచేసేది ఒక ఈవినింగ్ కాలేజి ఆఫీసులో–

"రూము ఊడ్వనా అంకుల్...."

సిగరెట్ పీకలు, నుసి, అగ్గిపుల్లలు, చెప్పులమట్టి, కాగితం ముక్కలు.... తక్షణం ఊడ్చేయాలనేంత గలీజ్‌గా ఉంది గది.

"నేను ఊడ్చుకుంటాలేమ్మా...." అన్నాను పక్కమీదినుంచి లేస్తూ–

"నే నూడుస్తా అంకుల్...." అంటూ మూలకున్న చీపురుకట్ట తీసుకుంది–

మధ్యాహ్నం వాళ్ళ పిన్ని తిట్లు, దెబ్బలు, హింసాకాండ గుర్తుకొచ్చాయి– గౌరివైపు చూశాను.

తన కేమీ జరగనట్లు ప్రశాంతంగా ఉంది గౌరిమొహం!

అవన్నీ గౌరికి కొత్తా?

కాఫీ పెట్టుకొని తాగి ఆఫీసుకెళ్ళాను.

డెలివరీకి పుట్టింటికిపోయిన నా భార్య జానకి ప్రసవించినట్లు, మగపిల్లాడ్ని కన్నట్టు టెలిగ్రాం వచ్చింది.

మరునాడు ఉదయమే ఊరికెళ్ళి నాలుగురోజులకు తిరిగొచ్చాను. గేటు

ముందు గౌరి ఎదురయింది- "బాబు బాగున్నాడా అంకుల్ ?" అని అడిగింది.

ఆ నాలుగురోజులు గౌరి నా మనసులో మెదుల్తూనే ఉంది.

తండ్రికి ప్రభుత్వ కల్లుదుకాణం, ప్రభుత్వ సారాదుకాణంతప్ప మరోహటి పట్టదు.

తల్లిలేదు.... సవతితల్లి ఉంది. ఆమె పెట్టే పోరు ఉంది.

సవతితల్లి పోరు.... అత్తపోరు, శత్రువుపోరుకంటె నరకం-

లోకంలో గౌరిలా రోజూ నరకాన్ని అనుభవించే పిల్లలెందరో ! సవతితల్లుల కంటె క్రూరంగా పిల్లల్ని తిట్టి, కొట్టే కన్నతల్లులున్నారు. వీళ్ళకెందుకో నడిచేపూవులపై....పలికే ఈ దేవతలపై అంత కోపం, ద్వేషం !

ఒకరోజు పొద్దున గౌరితమ్ముడు రవి వాళ్ళ పాకరేకు లెగిరిపోయేలా ఏడుస్తూ పెడబొబ్బలు పెడుతున్నాడు. తల్లి చెవులు పిండుతున్నది. వీపుమీద కసికొద్దీ బాదుతున్నది. తాను 'చా' చేసుకుందామని దాచుకున్న పాలు తాగేడట.

బావిదగ్గరున్న గౌరి పరుగున వచ్చి- "వద్దమ్మా... తమ్ముణ్ని కొట్టకమ్మా..." అంటూ పినతల్లి చేతుల్లోంచి తమ్ముని లాక్కుంది. దెబ్బలన్నీ గౌరివీపుమీద పడ్డాయి-

ఆమెకు వీపునప్పజెప్పి తమ్ముని అక్కున చేర్చుకొని నిల్చుంది గౌరి.

"కర్రెముండా.... లేయే- అడ్డులే..." అంటూ

చేయి నొప్పిపెట్టేదాకా బాదింది పినతల్లి. అన్ని దెబ్బలు తిందిగాని తమ్ముని పై ఒక్క-దెబ్బ పడనీలేదు.

పెద్దపెరిగాక ఆ అక్కను ఎలా చూస్తాడోగాని తమ్ముడిపై ఈగ వాలనివ్వదు గౌరి.

సాయంకాలం ఆఫీసుకు తయారవుతున్నాను- చేతులు నులుముకుంటూ గౌరి తండ్రి వచ్చాడు.

నా కాశ్చర్యం వేసింది.

ఈ సమయంలో అతడు ప్రభుత్వ కల్లుదుకాణం, ప్రభుత్వ సారాదుకాణం దారిలో ఉండాలి....

కాని.... మా గదిముందు....

"నమస్తే సార్...."

"నమస్తే రండి.... కూర్చోండి-" అన్నాను.

"వొద్దుసార్.... మీతో ఒక ముచ్చట మాట్లాడిపోదామని వచ్చిన...." అన్నాడు

"చెప్పండి...."

"మీరేం అనుకోవద్దు సార్... "

"చెప్పండి...."

చెప్పటానికి కాస్త తటపటాయించి- "ఇంట్ల శాన ఇబ్బందిగ ఉన్నది సార్" అన్నాడు.

ఉండదూ మరి! ప్రభుత్వ కల్లుదుకాణాలను, ప్రభుత్వ సారాదుకాణాలను మేపుతుంటె....!"

"ఊం....."

"శానపెద్ద ఇబ్బంది అయితాంది సార్...పనిచేసేది ఒక్కణ్ని...నలుగురు తినాలె- ఒక్క పది రూపాలుంటె సూడుండ్లిసార్.... ఫస్టికిచ్చేస్తా...."

ఇవ్వగానే నమస్కారంచేసి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత అది మామూలైపోయింది.

ఇంకో మూడు నెలలవరకు రావడానికి వీలుపడదంటూ మా ఆవిడ ఉత్తరం రాసింది. తాను వచ్చేలోపల రెండు లేక మూడు గదులున్న పెద్ద ఇల్లు అద్దెకు తీసుకొమ్మని మరీమరీ రాసింది.

వెతుకుతున్నాను....

ఆ రోజు శాలరీడే-

అలవాటు ప్రకారం స్వీట్స్ కొనుక్కపోయాను ఇంటికి- మా విడకు స్వీట్స్ అంటే ఇష్టం. ముఖ్యంగా కలాకంద అంటె. కాని చేయడం మాత్రం ఇష్టం ఉండదు.

పొద్దున్నే గౌరి వచ్చింది. స్వీట్స్ ఇచ్చి- "తినమ్మా-" అన్నాను.

తిన్లేదు గౌరి.

"తిను గౌరీ...." అన్నాను.

"ఇంటికిపోయి తింట అంకుల్-" అంది.

"సరే అలాగే తిను." అంటె స్వీట్స్ పట్టుకొని ఇంటికెళ్ళింది.

కిటికీలోంచి చూస్తూ కూర్చున్నాను.

"రవీ.. రవీ...." అని తమ్ముణ్ని పిలిచింది. చొక్కా, నిక్కరు లేకుండా పరుగెత్తుకొచ్చాడు తమ్ముడు. తొడపై కూర్చోబెట్టుకుని ఒక్కొక్క స్వీట్ తీసి తినిపించసాగింది.

సంబరంగా అక్క మెడచుట్టూ చేతులువేసి....రాగాలు తీస్తూ తినసాగాడు ఆ అబ్బాయి.

తమ్ముడి సంబరం చూస్తే గౌరికి ఎంత ఆనందమో! తాను తినడంకూడా మరిచిపోయి.... స్వీట్సన్నీ తమ్ముడికే తినిపించింది.

ఒకరోజు గౌరికోసం పలకా, పుస్తకాలు తెచ్చాను.

గౌరి ఇంట్లోకి వచ్చిందంటె క్షణం ఊరోక్కదు. పుస్తకాలు సర్దుతుంది. టెబుల్ గుడ్డ సరిచేస్తుంది. గది శుభ్రంగా ఊడ్చి, చెత్త బయటపోసి వస్తుంది.

ఇలాంటి శుభ్రత విషయంలో నే జానకి నాకు మధ్య చిన్న చిన్న తగాదాలు వస్తుంటాయి.

ఇల్లు నీటుగా ఉంచడమంటె ఆమెకు బోర్! చెత్తగా ఉంటె తలనొప్పి అంటుంది. పొద్దున లేచింది మొదలు ఆమెకు తన ఉద్యోగం గొడవే. అదృష్టం కొద్దీ నాది సాయంత్రం ఉద్యోగం కనుక ఆమె ఆఫీసుకు వెళ్ళినాక ఇల్లంతా శుభ్రంగా సర్దుతుంటాను. కాని తాను మాత్రం నేను రాత్రి వచ్చేసరికి కనీసం పక్కైనా సరిగా వేసుకోకుండా నిద్రపోతూంటుంది.... నీరసం!

చదువురాకున్నా గౌరిలో సంస్కారం ఉంది. శుచి, శుభ్రం అనే జ్ఞానం ఉంది.

"పలకా పుస్తకాలు ఎవరికి అంకుల్? బాబుకా? అప్పుడే చదువు కుంటాడా?" అని అడిగింది.

"కాదు నీకోసమేనమ్మా-" అన్నాను.

"నాకా! నాకు చదువెందుకు అంకుల్? మా తమ్ముడు చదువుకుంటాడుగా..."

"మీ తమ్ముడు చదువుకుంటె నువ్వు చదువుకోవా? నువ్వు కూడా చదువు కోవాలి-"

"మా అమ్మ పంపదు" అన్లేదు గౌరి.

తలవంచుకుని పుస్తకం చూడసాగింది.

"బడికిపోడానికి వీల్లేకపోతే ఇంట్లో చదువుకోవచ్చు-పొద్దంతా నేను ఇంట్లోనే ఉంటాగా.... రోజూ గంటసేపు చెప్తాను. చదువుకుంటావా?" అని అడిగాను.

మాట్లాడలేదు గౌరి.

"మీ నాన్నకు నేను చెబుతాలె.... చదువుకుంటావు కదూ?"

తలూపింది చదువుకుంటానన్నట్లు-

ఆరోజునుంచి తీరికిదొరికినప్పుడల్లా గౌరికి అక్షరాలు నేర్పసాగాను.

సాధారణంగా పిల్లలకు పెద్దల మెప్పు పొందాలనే తహతహ ఉంటుంది. గౌరి తన పినతల్లి మెప్పుకోసం ఎంతో ఉబలాటపడేద

ఒకరోజు వాళ్ళ పిన్ని ఎవరింటికో వెళ్ళింది. ఆమె వచ్చేసరికి గబగబా ఇల్లంతా శుభ్రంచేసింది. అందకున్నా ఎగిరెగిరి మూలలకున్న బూజు దులిపింది. ఒకసారి కిందపడి అయిదు నిమిషాలదాకా కుంటుతూ నడిచింది. బండలు కడిగింది. సామాను సర్దింది. పాలు, టీపొడి తెచ్చి పెట్టింది. మా ఇంట్లోంచి రెండు కుర్చీలు అడిగి తీసుకెళ్ళింది.

"గౌరీ ఏవిఁటి విశేషం?" అని అడిగాను.

"మా అమ్మ స్నేహితురాలు వస్తుంది-" అని చెప్పింది. 'అమ్మ' అంటె పినతల్లి. ఆమె మీ పినతల్లి అని మాటల్తో అందరూ గుర్తుచేస్తున్నా 'అమ్మా' అనే అంటుంది గౌరి.

చేయమని చెప్పకున్నా ఆ పనులన్నీ పూర్తిచేసి పినతల్లి, ఆమె స్నేహితురాలు వచ్చేసరికి తమ పాకకు ఒక కొత్త రూపాన్ని ఇచ్చింది గౌరి.

శుభ్రంగా కడిగిన గది, ఎక్కడి వక్కడ సర్దిన సామాన్లు చూసి మెచ్చుకోలుగా పినతల్లి ఒక్క చిఱునవ్వు నవ్వినా గౌరి ఎంతో పొంగిపోయేది.

కాని ... వస్తూనే గదిలో నిల్చున్న గౌరిని చూసి- "అయ్యో అందం.... బయటికిపో-"అనికసురుకుంది పినతల్లి-

మా ఆవిడ ఇంకో పదిరోజులకు వస్తుందనగా మూడు గదుల ఒక ఇల్లు అద్దెకు దొరికింది.

రెండుమూడు రోజుల్లో ఇప్పుడున్న గది ఖాళీచేయాలి.

అక్కణ్నుంచి వెళ్ళాలంటే మన కొప్పడం లేదు. ముఖ్యంగా గౌరి ఆ పరిస్థితులకు బలిఅయిపోతుంటే చూస్తూ వెళ్ళడానికి కాళ్ళు రావడంలేదు.

కాని, నేను చేయగలిగిందేవిఁటి? చూస్తూ బాధపడటం తప్ప!

మరునాడు పొద్దున గౌరితండ్రి నా దగ్గరికి వచ్చాడు-

"తమఁరు ఇల్లు ఖాళీ చేసి పోతాండ్లట సార్...." అని అడిగాడు.

అవునన్నాను.

అతడు విచారంగా మొహంపెట్టి- "మీ అసోంటి మంచోళ్ళకు మేం దూరమైపోతానమా సార్..." అన్నాడు.

అతని విచారానికి కారణమేవిఁటో, నా మంచితన మేవిటో నాకు తెలుసు.

"అమ్మాగారు వచ్చేదాకా మీకు ఇబ్బందే సార్...."

"ఆఁ.... ఏదో సర్దుకుపోవాలి...." అన్నాను.

"మీరు ఇబ్బంది పడ్తె మాకు బాధ అనిపిస్తది సార్. రోజూ పొద్దుగాల్నె మా కర్రెదాన్ని పంపుతా ఏమన్న పనుంటె చెప్పండ్లి-" అన్నాడు.

అతని ఉద్దేశం నా కర్థమయింది.

డబ్బుమీదున్న ప్రేమ వాళ్ళకు గౌరి మీద లేదు.

ఆ అమ్మాయిని పనిపిల్లగా మారుస్తున్నానేమో నన్న బాధ కలిగింది.

కాని వాళ్ళ పిన్నికి రోజులో చాలా భాగం దూరంగా ఉండే ఆ అవకాశాన్ని గౌరికి దూరంచేయదలుచుకోలేదు.

ఆ మరునాడు కొత్త అద్దెఇంటికి సామాను చేరవేయడంలో గౌరి సహాయం చేసింది.

నాతోపాటు సామాన్లు సర్దింది.

ఆ పనులన్నీ చేస్తున్న గౌరిని చూసి నాకో చెల్లెలుంటే చేసేదికదా అని సర్ది చెప్పుకున్నాను.

సాయంకాలం గౌరితండ్రి వచ్చి-

"ఒక్క పది రూపాయలుంటె సూడండ్లి సార్- ఇంట్లకు గింజలు బొత్తిగా లేవు-" అన్నాడు.

డబ్బు లివ్వగానే దారితీసేది ఇంటికి కాదు- ప్రభుత్వ సారాదుకాణానికి!

గౌరి రోజూ పొద్దునే వచ్చి పాలు తెస్తున్నది, వాకిలి,గదులు ఊడుస్తున్నది. కూరగాయలు తెచ్చి ఇస్తున్నది- చదువు కుంటున్నది.

ఒకరోజు చలిలో వణుకుతూ వచ్చిన గౌరిని చూసి నా హృదయం ద్రవించి పోయింది. చాలీచాలని దుస్తులు.... సూదుల్లా గుచ్చుకునే చలి.

ఆ రాత్రి ఆఫీసునుంచి వస్తూ ఒక స్వెట్టర్ తెచ్చాను. మరునాడు పొద్దున గౌరి రాగానే ఇచ్చి "వేసుకోమ్మా" అన్నాను.

"నాకా! వొద్దు అంకుల్-" అంది.

"వేసుకోమ్మా. చలిలో తిరిగితే ఆరోగ్యం చెడిపోతుంది తెలుసా...." అన్నాను.

"పరేక్కవలేదు అంకుల్—" అంది

"అయినా సరే వేసుకుంటావా నేను వేయనా ?" అన్నాను.... వేసుకుంది.

ఒక కొత్త వస్తువు తమదని తెలిసినప్పుడు సహజంగా పిల్లలలో కలిగే ఆనందం గౌరిమొహంలో కనిపించలేదు.

రోజటిలాగే మరునాడు పొద్దున వచ్చింది. అంత దూరం కాలినడకతో—చలిలో....

"అదేంటమ్మా స్వెట్టర్ వేసుకోక పోయావా ? బయట ఎలా మంచు కురుస్తున్నదో చూడు—" అన్నాను.

గౌరి మాట్లాడలేదు. తల వంచుకుని నిల్చున్నది ఎందుకో భయపడుతున్నది.

"మీ పిన్ని కోప్పడిందా ?" అని అడిగాను.

కాదన్నట్లు తలూపి—"నాకు చలిపెట్టా లేదు అంకుల్—" అంది.

"అయినా సరే వేసుకోమ్మనా కదమ్మా...."

మెల్లగా తలెత్తి నావైపు చూసింది.

ఏదో చెప్పడానికి భయపడుతున్నది.

"చెప్పమ్మా. మీ నాన్న కోప్పడ్డాడా?" అని అడిగాను. కోప్పడడని నాకు తెలుసు.

కాదన్నట్లు తలూపింది.

"మరి ?...."

తలవంచుకుని... భయపడుతూ ... మెల్లగా చెప్పింది.

"తమ్ముడికి బాగా సర్దిచేసింది అంకుల్. చలిపెడుతున్నదని నేనే తొడిగిన...."

నేను నవ్వి, "అంతేనా—సరేలేమ్మా—" అన్నాను. అప్పుడుగాని ఆ అమ్మాయి మొహంలోని భయంపోలేదు.

గౌరికి మరో స్వెట్టర్, రెండు జతల దుస్తులు తెచ్చాను

నాలుగురోజులు గడిచాయి—

ఒకరోజు ఇంటికి వెళ్ళే సమయానికి గౌరి దిగులుగా కూర్చొని ఉంది.

"ఏంటమ్మా.... ఎందుకో దిగులుగా కూర్చున్నావ్ ?" అని అడిగాను.

తలవంచుకుని— "అంటీ వస్తే పని చేయలేదట.... మా అమ్మ ఇక్కడే ఉండమంది అంకుల్...." అంది.

ఆ విషయం విన్న సాయంత్రం వాళ్ళ నాన్న నాతో అన్నాడు.

వాళ్ళ ఉద్దేశ్యం ఏదైనా రోజూ అంత దూరం చలిలో గౌరి నడిచిరావడం, పోవడం నాకు బాగనిపించలేదు.

ఇక్కడే ఉంచటానికి గౌరి ఇష్టపడుతుంది. సంతోషిస్తుంది అనుకున్నాను—

"మంచిదే కదా గౌరి— ఇక్కడే ఉండు—" అన్నాను.

వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ తలకు మోచేతులు అడ్డంపెట్టుకుంది గౌరి.

దగ్గరగా వెళ్ళి— "ఏంటమ్మా ఏడుస్తున్నావా ?" అని అడిగాను.

గౌరి మాట్లాడలేదు.

"చెప్పమ్మా.... ఇక్కడుండటం నీకిష్టంలేదా ?" అని అనునయంగా అడిగాను.

"కాదు అంకుల్....అమ్మ తమ్ముణ్ణి కొడుతుంది"అంది వెక్కి-వెక్కి ఏడుస్తూ.

———